నేటి నుంచి మల్లన్న కల్యాణమహోత్సవాలు

కీసర: నేటి నుంచి కీసర భ్రమరాంబకేతమ్మమల్లిఖార్జునస్వామి దేవస్థానం కల్యాణమహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు కీసర యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు గణపతిహోమం, గంగతెప్ప ఊరేగింపు, ఊరిబోనాలు, 17న సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, అగ్నిగుండాలు, సాయంత్రం 4 గంటలకు మల్లన్నస్వామికి బోనాలు, 18న మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎల్లమ్మ, కొండపోచమ్మ అమ్మవార్లకు బోనాలు ఉంటాయని తెలిపారు.

కమర్షియల్ ట్యాక్స్ చెల్లించకుంటే ఆస్తిని సీల్ చేస్తాం



కుందన్‌పల్లిలో గోదామ్‌ను సీల్ చేస్తున్న దృశ్యం

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కమర్షియల్ భవనాలు, ఇళ్ల ట్యాక్స్‌లు చెల్లించకుంటే సదరు ఆస్తిని సీల్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ నాగమణి, మేనేజర్ వెంకటేశం అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని కుందన్‌పల్లిలోని విజయ ప్రభ, ఐశ్వర్య కమర్షియల్ ఇంటిపన్ను బకాయిలు అధికంగా ఉన్నందున వారి ఇంటిని సీల్ చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రజలంతా తమ ఇంటి పన్నులు, కమర్షియల్ ట్యాక్స్‌లు వెంటనే మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. మున్సిపల్ వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామ్ మెటీరియల్ అందజేత



మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు రాహుల్‌యాదవ్ ఎగ్జామ్ మెటీరియల్ అందజేశారు. పదోతరగతి విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్, ఇతర మెటీరియల్ పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ నాగమణి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులపై దాడి.. కేసు నమోదు

మేడ్చల్‌రూరల్: ఎస్టీ హాస్టల్ విద్యార్థులపై దాడి జరిగిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఇంజినీరింగ్ చేస్తూ మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ హాస్టల్లో ఉంటున్న విద్యార్థికి సీనియర్లకు మధ్య భోజనం విషయంలో శుక్రవారం రాత్రి వివాదం తలెత్తింది. సేవాలాల్ జయంతిపై చర్చ జరుగుతున్నందున కొద్ది సేపు ఆగాలని వారు సూచించగా.. ఈ విషయంపై ఇరువర్గాల మధ్య చిన్న ఘర్షణ జరిగింది. కాగా నితిన్ అనే విద్యార్థి అర్ధరాత్రి బయట నుంచి 30 మందిని హాస్టల్‌కు పిలిపించుకుని సీనియర్లపై దాడి చేశాడని సమాచారం. ఈ దాడిలో బలవీర్, శ్రీకాంత్, అరుణ్, హరీష్ తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. కాగా దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై బైక్ ర్యాలీ

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే నిశ్చితంగా, నిర్భయంగా రాకపోకలు సాధ్యమవుతాయని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను పెంపొందించేందుకు నగర ట్రాఫిక్ పోలీస్ విభాగంతో కలిసి కొంపల్లిలోని ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ 10 కిలోమీటర్ల మేర సాగగా.. పెద్ద సంఖ్యలో యువత బైక్స్‌తో పాల్గొన్నారు. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) వెంకటరెడ్డి హాజరై ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



లలిత (ఫైల్)

మేడ్చల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి యాదారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం యాదారం గ్రామానికి చెందిన కుమార్ వీఆర్‌ఏగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్నాడు. కుమార్ భార్య లలిత (38) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. ఆమె మృతిపై అనుమానం తలెత్తడంతో గ్రామానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కరువు!

- అభివృద్ధికి నోచుకోని ఇన్ఫోసిస్ పరిసరాలు
- మౌలిక వసతుల లేమితో ఇక్కట్లు



పోచారం: ఇన్ఫోసిస్ క్యాంపస్ పరసరాల్లో ఎటు చూసినా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులు సైతం నిర్లక్ష్యానికి గురయ్యాయి. మట్టి రోడ్లతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తమ సమస్యను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగర తూర్పు భాగం అభివృద్ధి చెందాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పోచారంలో ఇన్ఫోసిస్, రహేజా మైండ్ స్పేస్ వంటి సంస్థల క్యాంపస్‌లు వచ్చాయి. వీటి సమీపంలో ఉద్యోగుల కోసం పలు పేయింగ్ గెస్ట్ హాస్టళ్లను కూడా నిర్మించగా.. వాటికి మౌలికవసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ మరీ దారుణం..

భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ రెగ్యులరైజేషన్ ఫీజులు, ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సుల పేరుతో భారీగా పన్నులు వసూళ్లు చేస్తున్న అధికారులు మౌలికవసతులు మాత్రం కల్పించడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేవని సమాధానం..

మౌలిక వసతుల కోసం మున్సిపాలిటీ అధికారులను కోరితే నిధులు లేవన్న సమాధానం ఇస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మున్సిపాలిటీ ప్రతిష్ట ఇనుమడించలేక..

ఐటీ దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్ పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో పోచారం పురపాలక సంఘం ఘోరంగా విఫలమైందని విమర్శలు వినిపిస్తున్నాయి.

పోచారం అభివృద్ధి చెందాలంటే..

ఐటీ కారిడార్ ఏర్పాటుతో పోచారం అభివృద్ధి చెందుతుందని, రైతులు తమ భూములను ఇచ్చారు. ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో ఐటీ సంస్థలు వెనుకబడి ఉండటంతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు.

స్థానికులకు ఉపాధికి దోహదం..

వర్క్ ఫ్రమ్‌హోమ్‌ను తొలగించి పూర్తిస్థాయిలో వర్క్ ఫ్రమ్ ఆఫీస్ విధానాన్ని ఐటీ సంస్థలు అనుసరించాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో పోచారం పరిసరాలు వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు.

వర్క్ ఫ్రమ్ హోం తొలగించాలి..



పోచారం ఐటీ కారిడార్‌లోని ఐటీ కంపెనీలు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం తొలగించి పూర్తిస్థాయిలో వర్క్ ఫ్రమ్ ఆఫీస్‌ను అమలు చేయాలి. దీంతో మరో వేయిమందికి ఉపాధి లభిస్తుంది. ఐటీ కారిడార్ ఏర్పాటుకు రైతులు సహకరించినట్లే సంస్థలు కూడా ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలి. – మన్నె నర్సింహ్మారెడ్డి, పోచారం

అంతర్గత మూల్యాంకనం ముమ్మరం

- 21 తేదీ వరకు పదో తరగతి అంతర్గత మూల్యాంకనం
- 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా విద్యాశాఖ కసరత్తు

సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతిలో విద్యార్థుల అంతర్గత మార్కుల మూల్యాంకనం ముమ్మరంగా సాగుతోంది. నిర్దేశిత నిబంధనల ప్రకారం పిల్లల అభ్యాసన సామర్థ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పాఠశాలలో నిర్వహించిన పరీక్షలు, రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

34 బృందాలుగా..

- పదోతరగతి పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.
- ప్రభుత్వం ఒక పూట అల్పాహారానికి నిధులు సమకూర్చగా ప్రత్యేక తరగతులతో విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై పట్టు కల్పించేలా ప్రణాళిక ప్రకారం ముందుకుసాగుతున్నారు.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వరంగ పాఠశాలలతో పాటు 893 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అందులో 47,322 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలు రాయనున్నారు.
- పరీక్షల్లో 80 మార్కులు ఉండగా.. పాఠశాలలో విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను పరిగణలోకి తీసుకుని 20 మార్కుల వరకు కేటాయిస్తారు.
- విద్యార్థులు రాసిన ఎఫ్‌ఏ పరీక్షలతో పాటు రికార్డులను పరిశీలించేందుకు 34 బృందాలు తనిఖీ చేస్తున్నాయి.
- 20 మార్కులకు విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల నైపుణ్యాలకు తగినట్లుగా మార్కులు వేస్తున్నారు. వారికి కేటాయించిన పాఠశాలల్లో ముగ్గురు విషయ నిపుణులతో కూడిన కమిటీ సభ్యులు ఇప్పటి వరకు 60 శాతానికి పైగా అంతర్గత మూల్యాంకనం పూర్తైనట్లు జిల్లా విద్యాధికారులు చెబుతున్నారు.
- ఈనెల 21 వరకు తనిఖీ పూర్తి చేసేలా విద్యాశాఖ కార్యాచరణ రూపొందించారు. పరిశీలన తర్వాత వివరాలను నెలాఖరు లోగా ఆయా పాఠశాలలు కంప్యూటర్‌లో పొందుపరచనున్నారు.
- 100 మార్కులకు పరీక్ష నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానం వచ్చే ఏడాది నుంచి అమలైతే ఈసారి నిర్వహించిన అంతర్గత మూల్యాంకనం చివరిదిగా నిలిచిపోనుంది.
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 893 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉండగా.. 47,322 మంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. ఇందులో 132 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 8000 మంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. వీరంతా పదోతరగతి పరీక్షలు రాయనున్నారు.

సెయింట్ పీటర్స్‌లో స్పెక్ ఫెస్టా – 2025



స్పెక్ ఫెస్టాలో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్పెక్ ఫెస్టా – 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటర్‌ప్రెన్యూర్ విభాగాన్ని ప్రారంభించారు. ఐబీఎం, డెలివరీ ప్రాజెక్ట్ మేనేజర్ సుకన్తో మహంతి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. కళాశాల సెక్రటరీ టీవీ. రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ.. విద్యార్థుల ఆలోచనలు రేకెత్తించేందుకు ఇలాంటి ఫెస్ట్‌లలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగవుతుందని, అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డైరెక్టర్లు సరోజరెడ్డి, అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కీసర: కృషి, పట్టుదల, క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కీసర మండలంలోని భోగారంలోని మేడ్చల్, ఖైరతాబాద్, అంబర్‌పేట్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్(బాలుర)స్కూల్, జూనియర్ కాలేజీని మేడ్చల్ –మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదవి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. భోజనశాలలో టేబుళ్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. స్కూల్‌లోని వంటశాల, స్టోర్ రూమ్‌లను పరిశీలించి శుభ్రంగా ఉండాలని ఇన్‌చార్జ్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఫేజ్ జేఈఈలో 89 శాతం సాధించిన కె. తరుణ్‌ను కలెక్టర్ అభినందించారు. తరుణ్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్, అవసరమైన చేయూతనందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేశవ, నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సీతారాం అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో యాంటి డ్రగ్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగించడం వల్ల యువత మత్తుకు బానిస అవుతున్నారని, దీంతో చదువుపై శ్రద్ధ తగ్గిపోయి సంఘ వ్యతిరేక శక్తులుగా మారతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల విద్య ఎంతో విలువైందని, యువత చెడు దారిన వెళ్లకూడదని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడిన అనంతరం విద్యార్థులతో పోలీసులు డ్రగ్స్ నివారణ ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రత్నకుమారి, ఏవో రాజేష్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ కో– ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కీసర బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ రాజశేఖర్

కీసర: ప్రసిద్ధ శైవక్షేత్రం కీసరగుట్టలో ఈనెల 24 నుంచి 6 రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జిల్లాతో పాటు, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చే యాత్రికులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. శనివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో కీసరగుట్టలో చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తుల రద్దీని బట్టి దాదాపు 200 ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాల నుంచి నడపనున్నట్లు స్పష్టం చేశారు. డిప్యూటీ ఆర్‌ఎం శ్రీనివాస్ , భీమ్‌రెడ్డి, కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్, కంటోన్మెంట్, రాణిగంజ్, హకీంపేట్ ఉప్పల్, చెంగిచెర్ల డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జెడ్సీ హేమంత్ కేశవ పాటిల్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పలు కాలనీలు రోడ్లు, ఓపెన్ జిమ్స్, కమ్యూనిటీ హాల్స్‌కు సంబంధించిన నిధులను త్వరగా మంజూరు చేయాలన్నారు. కొన్ని కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడంతో రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, తక్షణమే ఆయా కాలనీల్లో నూతన సీసీరోడ్లు నిర్మించాలని చెప్పారు. సానుకూలంగా స్పందించిన జెడ్సీ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో మహిళ ఆత్మహత్య

ఉప్పల్: ఆర్థిక సమస్యలు భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ భార్య సంగీత (44) ఈనెల 14న రెస్ట్‌రూమ్‌లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న భర్త హుటాహుటినా స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మధ్యకాలంలోనే కూమార్తె పెళ్లి చేశామని దీంతో ఆర్థిక సమస్యలు అధికం కావడంతోనే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే దరఖాస్తుల స్వీకరణ

బోడుప్పల్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో పాల్గొనని కుటుంబాల నుంచి తిరిగి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమిషనర్ శైలజ వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ ప్రజాపాలన సేవా కేంద్రంలో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మున్సిపల్ ఆఫీసుకు దూరంగా ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబరు 14420, మున్సిపల్ పౌర సేవా కేంద్రం ఫోన్ నంబర్ 040– 27215959కు ఫోన్ చేసి అడ్రస్సు తెలిపినచో మున్సిపల్ వార్డు ఆఫీసర్ ఇంటికొచ్చి దరఖాస్తులు నింపి డాటా ఎంట్రీ చేస్తారన్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మేడ్చల్‌రూరల్: ఓ గుర్తుతెలియని వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబర్–4 పై 65 ఏళ్లున్న వృద్ధుడు మృతి చెందినట్లు గుర్తించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అనంతరం గాంధీ మార్చురీకి తరలించారు. సదరు వ్యక్తి భిక్షాటన చేస్తుండేవాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుడి శరీరంపై రక్తపు మరకలు ఉండటంతో మరో కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: గుండిగూడెం సమీపంలోని ఎరిమల్లె వాగులో ఘట్‌కేసర్ పోలీసులకు గుర్తు తెలియని మృతదేహం శనివారం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తెలియాడుతుందన్న స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి 40–45 ఏళ్లు ఉండొచ్చని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం

మల్కాజిగిరి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాణీనగర్ శ్రీసాయి నిలయం అపార్టుమెంట్‌లో నివాసం ఉండే తార్‌సిలా(67) అపార్ట్‌మెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అపార్ట్‌మెంట్ నిర్వహణకు సంబంధించిన డబ్బులు దుర్వినియోగం అయినట్లుగా గుర్తించి ఆమెను ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులతో అపార్ట్‌మెంట్‌వాసుల నుంచి కూడా అప్పులు చేసినట్లుగా చెప్పింది. ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. నృత్య సంపద, నాట్యం సంస్థ గురువులు తోగర్చేడు వరుణ్ శర్మ, సురేఖ సాయిశిష్యబృందంచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మూషికవాహన, మరకత మణిమయ, మహేశ్వరి, భామాకలాపం, దేవదేవం, బ్రహ్మాంజలి తదితర అంశాలను కళాకారులు హారతి, అక్షర, శంకర, ప్రీతి, నవనీత, అమృత, శ్రీరమ్య, శ్రీనిధి, ఆద్యశ్రీ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: 12 కోట్ల మంది లంబాడ జాతి ఆరాధించేది సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించుకునే రోజులు వస్తాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా మండలంలోని రాజబొల్లారం తండాలో జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సేవాలాల్ మహారాజు జయంతిని జరుపుకుంటున్నారని, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో నిర్వహించుకోవడం సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ప్రధాని మోదీకి లంబాడ జాతి సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఉందని, ఈ జాతి సంస్కృతి, గౌరవాన్ని కాపాడటం కోసం మహారాష్ట్రలో స్ఫూర్తి కేంద్రాన్ని రూ.వేల కోట్లతో ఏర్పాటు చేశారని తెలిపారు. భవిషత్‌తరాలకు వీరి చరిత్ర అందించడం కోసం గొప్ప కేంద్రం కూడా తయారు కాబోతుందన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా జరపాలని కోరుతూ.. ఇటీవల సాంస్కృతికశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశామని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు విక్రంరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, మోహన్‌రెడ్డి, జగన్‌గౌడ్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, నారపల్లి ప్రాంతాల్లో సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం బంజారాలు ఘనంగా నిర్వహించారు. జాతి పురోగమనానికి సేవాలాల్ బోధనల గురించి నిర్వాహకులు వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎంపీ ఈటల



మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి